# ముఖ్యమంత్రి కార్యాలయము

# తెలంగాణ ప్రభుత్వం

**పత్రికా ప్రకటన** **తేది: 26-05-2017**

తెలంగాణ ధనిక రాష్ట్రమని ముఖ్యమంత్రి శ్రీ కె. చంద్రశేఖర్ రావు చెప్తున్న విషయం అక్షర సత్యమని మరోసారి రుజువైంది. తెలంగాణ రాష్ట్ర ఆదాయ వృద్ధి రేటు ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గదని సీఎం పలుమార్లు చెప్పారు. ఆయన అంచనాలకు తగినట్లుగానే గత ఆర్థిక సంవత్సరం గణాంకాలున్నాయి. గురువారం నాడు 2016-17 ఆర్థిక సంవత్సరం గణాంకాలు వెల్లడయ్యాయి. ఫిబ్రవరి వరకు వివరాలు బహిర్గతమయ్యాయి. దీని ప్రకారం ఆదాయాభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం మరోసారి దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచింది. ప్రధానమైన పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో 17.82 శాతం వృద్ధిరేటు సాధించగా, అన్ని రకాల పన్నుల ఆదాయంలో 17.81 శాతం వృద్ధి రేటు సాధించింది. ప్రధానమైన సేల్స్ టాక్స్, ఎక్సైజ్, స్టాంప్స్ – రిజిస్ట్రేషన్ ల ద్వారా 17.82 శాతం వృద్ధిరేటు సాధించింది. 2015-16 సంవత్సరంలో మార్చి నుంచి ఫిబ్రవరి వరకు 33,257 కోట్ల ఆదాయం రాగా, ఇదే సమయానికి 2016-17 ఆర్థిక సంవత్సరంలో 39,183 కోట్ల రూపాయల ఆదాయం సమకూరింది. దీంతో తెలంగాణ రాష్ట్రం ప్రధాన పన్నుల ద్వారా 17.82 శాతం ఆదాయ వృద్ధిరేటును పెంచుకోగలిగింది. ఇక పై మూడు పన్నులతో పాటు రవాణా రంగం, ఇతర మార్గాలన్నీ కలుపుకుని 2015-16 ఆర్థిక సంవత్సరంలో 36,130 కోట్ల రూపాయల ఆదాయం వస్తే, 2016-17లో 42,564 కోట్ల ఆదాయం వచ్చింది. తెలంగాణ రాష్ట్రం 17.81 శాతం వృద్ధిరేటు సాధించగలిగింది. ఈ రెండు విభాగాల్లోనే తెలంగాణ దేశంలో నెంబర్ వన్ గా నిలిచింది.

ఎస్.ఓ.ఆర్., ఎస్.ఓ.టి.ఆర్. రెండు విభాగాల్లోనే దాదాపు 17శాతానికి పైగా వృద్ధిరేటు సాధించడం పట్ల ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు సంతోషం వ్యక్తం చేశారు. తెలంగాణ ధనిక రాష్ట్రమవుతుందని ఉద్యమ సమంయలోనే తాను వాదించానని, ఈ మూడేళ్ల సమయంలో ఈ విషయం అనేక సార్లు రుజువైందని సీఎం అన్నారు. ప్రతికూల పరిస్థితుల్లో కూడా తెలంగాణ రాష్ట్రానికి పన్నుల ద్వారా వచ్చే ఆదాయం తగ్గకుండా, పెరుగుదల సాధించడం గొప్ప విశేషమని సీఎం అన్నారు. తెలంగాణ రాష్ట్ర అధికారులకు, తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కృతజ్ఞతలు, అభినందనలు తెలిపారు. ఆదాయ వృద్ధిరేటులో అనుకున్న పెరుగుదల వస్తున్నందు వల్ల రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను మరింత ఆత్మవిశ్వాసంతో ముందుకు తీసుకుపోతామని సీఎం ప్రకటించారు. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ఈ వివరాలు వెల్లడించారు.

**సిపిఆర్ఓ టు సిఎం**